చెన్నూరు.. జనహోరు


సామాజిక సాధికార సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న జనం

వల్లూరు/కమలాపురం/చెన్నూరు: చెన్నూరు జన సంద్రమైంది. ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు వచ్చిన భారీ జనంతో గ్రామంలో జాతర వాతావరణం కనిపించింది. చెన్నూరుకు వెళ్లే దారులన్నీ వైఎస్సార్‌సీపీ భారీ ఫ్లెక్సీలతో కళకళలాడాయి. ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. ఉత్సాహంగా తరలి వచ్చిన నేతలు, అభిమానులు, కార్యకర్తల జగన్ నినాదాలతో హోరెత్తాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉండగా నిర్మించిన చెన్నూరు– కొండపేట వంతెనపై వేదికను ఏర్పాటు చేయగా, వంతెనకు ఇరువైపులా సాధికార బస్సు యాత్రకు హాజరైన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలకు ఘనంగా ఆహ్వానం పలుకుతూ వెలసిన భారీ ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కమలాపురం నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుంచి అన్ని వర్గాలకు చెందిన ప్రజలు భారీగా తరలి వచ్చారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు, యువత స్వచ్ఛందంగా తరలి వచ్చి మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధనకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తాము వెన్నంటి ఉంటామని సంఘీభావం తెలిపారు. సభ ప్రారంభానికి ముందు ప్రభుత్వ పథకాలు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ గురించి వివరిస్తూ వేదికపై పలువురు గాయకులు పాడిన పాటలు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి. పలువురు వైఎస్సార్‌సీపీ జెండాలను పట్టుకుని పాటలకు చేసిన నృత్యాలు ఉత్సాహంగా సాగాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగు నీటి సౌకర్యంతో బాటుగా మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు.

ఇర్కాన్ సర్కిల్‌లో వైఎస్ విగ్రహానికి పూల మాలలు

కడప నుంచి చెన్నూరులోని కొండపేట వంతెన వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు బయలుదేరిన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఇర్కాన్ సర్కిల్‌లోని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నేతలకు నివాళి

వేదిక వద్దకు చేరిన నేతలు మొదట వేదిక ముందు భాగంలో ఏర్పాటు చేసిన డా. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, బాబూ జగజ్జీవన్ రామ్, మౌలానా అబుల్ కలాం అజాద్, సాహూ మహరాజ్ వంటి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేదికపై చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులు రెడ్డి నేతలకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు, ఆరు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.


దప్పు వాయిద్యాలతో సభకు వెళుతున్న నాయకులు, కార్యకర్తలు


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


చెన్నూరులో బెలూన్‌లు ఎగురవేస్తున్న నాయకులు

మానవ హక్కులపై అవగాహన కలిగిఉండాలి

కడప ఎడ్యుకేషన్: మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, జాతి, మతం బేధాలతో సంబంధం లేకుండా ప్రతి మనిషికి లభించేది ప్రాథమిక స్వేచ్ఛఅని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత పేర్కొన్నారు. ఆదివారం కడప ఎర్రముక్కపల్లెలోని నవజీవన్ నిరాశ్రయుల వసతి గృహంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే ×మానవ హక్కుల దినోత్సవం× కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల ప్రాథమిక ప్రాముఖ్యతను వివరించారు. అందరికీ న్యాయం, సమానత్వం, శాంతి, స్వేచ్ఛ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో షెల్టర్ హోం నిర్వాహకులు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

కడప వైఎస్సార్ సర్కిల్: మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా మానవ హక్కుల భంగం కలిగిన వారికి ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దయ్య, ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ చీఫ్ అశోక్‌కుమార్ రెడ్డి, మల్లిఖార్జున, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మానవ హక్కులపై అవగాహన కల్పిస్తున్న శాంత

బలిజలు నిర్ణయాల అమలుకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రయ్య


కార్యక్రమంలో పాల్గొన్న బలిజ కుటుంబాలు

కడప కల్చరల్ : ఐక్యతతోపాటు తాము తీసుకున్న నిర్ణయాలను సరిగ్గా అమలు చేసేందుకు బలిజలు కృషి చేయాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్య సూచించారు. స్థానిక జిల్లా బలిజ సంక్షేమ సంఘం (బాస్) అధ్యక్షులు దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నగర శివార్లలోని నందనం గార్డెన్స్‌లో కార్తీక మాసం సందర్భంగా బలిజలు వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామచంద్రయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బలిజ యువత ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో రాణించాలన్నారు. సంస్థ అధ్యక్షులు దాసరి శివప్రసాద్ మాట్లాడారు.

బైక్ ర్యాలీ..

బళ్లారిరోడ్డులోని బాస్ సంస్థ కార్యాలయం వద్ద నుంచి ఉదయం పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీని ప్రారంభించారు. తొలుత శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులు అర్పించారు. దాదాపు మధ్యాహ్న సమయానికి పెద్ద సంఖ్యలో బలిజలు చేరుకోవడంతో ఆ ప్రాంతం తిరునాళ్లను తలపించింది. నిర్వాహకులు హాజరైన వారికి భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు పీవీఎస్ మూర్తి, పారిశ్రామికవేత్త అమరప్ప, ఉద్యోగుల సంఘాల నాయకులు సగినాల శ్రీనివాస్, సీఆర్‌సీ బాబు, మూర్తి, మురళి, వైద్యులు హరి కిషన్, సురేష్ బాబు, తంగిరాల వేణుగోపాల్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ కాలనీలో ఘర్షణ

కడప అర్బన్: కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ అన్నమయ్య జిల్లాలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారికి, నెహ్రూపార్క్ సమీపంలోని ఓ ప్రముఖ హోటల్‌లో పనిచేస్తున్న వారికి ఈనెల 9వ తేదీరాత్రి శనివారం వాగ్వాదంతో ప్రారంభమై ఘర్షణకు దారి తీసింది. వివరాలిలా..హోటల్‌లో పనిచేస్తున్న వారు తమ పని ముగించుకుని తాము అద్దెకుంటున్న గదులకు విశ్రాంతి కోసం వచ్చారు. ఆ సమయంలో కేకలు వేస్తున్నారని పోలీసు అధికారి వారిని వారించారు. అదే సమయంలో హోటల్‌లో పనిచేస్తున్న యువకులు కూడా వాగ్వాదానికి దిగారు. పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు

తాడిగొట్ల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఫిమ్స్ కళాశాల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివార్లలోని తాడిగొట్ల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ఫిమ్స్ డైరెక్టర్ ఏక్యూ జావెద్ తెలిపారు. ఆదివారం ఫాతిమా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో కుటుంబ ప్రాథమిక ఆరోగ్య దత్తత స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు ఎలాంటి అనారోగ్యం తలెత్తినా సత్వరమే తమ ఆస్పత్రిలో సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. అనంతరం ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఫిమ్స్ ఈడీ మహమ్మద్ సల్మాన్ ముర్తజా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలారేఖ, వైస్ ప్రిన్సిపాల్ రామమనోహర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ ఓబులేశు, తాడిగొట్ల సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సందడిగా గీతా శ్లోకాల పఠన పోటీ


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానాలు అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లు నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు ఆదివారం నగర శివార్లలోని శ్రీ లలిత పంచాయతన ఆలయ ప్రాంగణంలో సందడిగా నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగామ్ అసిస్టెంట్ గోపిబాబు పర్యవేక్షణలో జిల్లాకు చెందిన పలు పాఠశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. చిన్మయ మిషన్ అధ్యక్షులు, ఆలయ నిర్వాహకులు స్వామి తురియానంద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధర్మ ప్రచార మండలి సభ్యులు బెస్తవేముల రామమహేష్, వెంకట సుబ్బారెడ్డి, అర్చక సంఘం అధ్యక్షులు విజయ్‌భట్టర్, గీతాకారుడు శ్రీకృష్ణుని చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్లుగా, 8,9 తరగతుల విద్యార్థులు సీనియర్లుగా పోటీ నిర్వహించారు.

విజేతలు వీరే .. ఈ పోటీలో అన్ని విభాగాలలో ప్రథమ బహుమతిగా రూ. 1000, ద్వితీయ బహుమతి రూ. 750, తృతీయ బహుమతిగా రూ. 500 అందజేశారు. జూనియర్లలో తనుశ్రీ, సహృద రాయుడు, శిరి వర్ధిని, సీనియర్లలో చిన్మయి, వైపీఎస్ఎస్ లిఖిత, సాయికృతి, గీత సంపూర్ణ శ్లోకాల పఠన పోటీల్లో విజయశ్రీ సాయి లిఖిత, సుకృత్, ఎస్.సాయికృతి మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. నాగజగదీష్‌చంద్ర, పరమేష్, మహేశ్వరి, సుకృత్, జ్ఞానేశ్వరిలకు ప్రోత్సాహక బహుమతులు దక్కాయి. బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమారస్వామి, లలిత పీఠం అధిపతి స్వామి తురియానంద సరస్వతి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టీటీడీ బహూకరించిన ప్రశంసాపత్రాలు, పుస్తక ప్రసాదం కూడా వారికి అందజేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి


మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23, 24, 25వ తేదీల్లో పులివెందుల పర్యటన ఉంటుందని.. ఆయన వచ్చేనాటికి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. పాత సొంత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్ దుకాణాలను వారు పరిశీలించారు. వ్యాపారాలు పెట్టుకునే వ్యాపారస్తులు పది రోజులు ముందుగానే దుకాణాలను వారికి అప్పగించాలన్నారు. షాపులు పొందినవారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే నాటికి షాపులను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండును వారు పరిశీలించారు. ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కాంట్రాక్టర్ కోడి రమణ తదితరులు పాల్గొన్నారు.

నగరేశ్వరునికి రుద్రాభిషేకం


నగరేశ్వరునికి రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఉద్యానవనంలో ఆదివారం రాత్రి శ్రీపార్వతి సమేత నగరేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. 102 మంది సుహాసినులు అష్టోత్తర శత నామార్చన నిర్వహించారు.


సహస్రనామ అర్చన చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

14న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలోని కరువు, తుఫాను వలన పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, కార్యవర్గ సభ్యులు రామయ్య, నాగ సుబ్బారెడ్డి, బసిరున్నిసా, సుబ్రహ్మణ్యం, వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు

కడప కార్పొరేషన్: తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. రాజంపేట రోడ్డులోని కనుమలోపల్లిలో ఉన్న 108 శివలింగాల మహాశివుని సన్నిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాదిమంది తొగట వీర క్షత్రియులు హాజరయ్యారు. మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడు కె. సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, టి. సుదర్శన్, యు. సుబ్రమణ్యం, బాలచౌడన్న, డి.వెంకట రమణ, డా. బండారు శ్రీనివాసులు, 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత, డివిజన్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఫుట్‌పాత్‌లపై అడుక్కుంటున్న యాచకులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ మాసంలో సేవా కార్యక్రమాలతో పేదలను ఆదుకోవడమే నిజమైన క్రిస్మస్ ఆనందమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు రత్న, కారుణ్య పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: నెల్లూరు నగరంలో ఈ నెల 15,16,17 తేదీలలో నిర్వహించనున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ కోరారు. ఆదివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను కడపలోని పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, నాగన్న, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోతుల బారి నుంచి కాపాడాలి

కడప వైఎస్సార్ సర్కిల్: రామరాజుపల్లెలో కోతుల బారి నుంచి ప్రజలను కాపాడాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామరాజుపల్లెలో గత నెల రోజుల నుంచి ప్రజలను కోతులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. చిన్నారులను కరిచి గాయపరుస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా నగరపాలక కమిషనర్ స్పందించి కోతుల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరారు.

నూతన నియామకం


మల్లికార్జున

వైవీయూ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలానికి చెందిన కోడూరు మల్లికార్జున ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో ఈయన్ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కాగా ఈయన 2013 నుంచి ఏబీవీపీలో పలు బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు.

కనీస వేతనాలను అందించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలను అందించాలని ఏపీ మధ్యాహ్న పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగనన్న గోరు ముద్దకు మెస్ చార్జీలను పెంచాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెను చార్జీలను పెంచి కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్ర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాలబైరవస్వామికి పూజలు

కడప కల్చరల్ : కార్తీక మాసంలో వచ్చే బహుళ అమావాస్యను పురస్కరించుకుని నగర సమీపంలోని మగ్దూం సాహెబ్ కొట్టాలలోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు బాసట బాలాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు విశేష అభిషేకాలు, అనంతరం భక్తులచే సామూహికంగా కుష్మాండ దీప సేవ ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు కార్తీక ఆత్మీయ సమ్మేళనం

కడప కల్చరల్ : జిల్లాలోని అర్చకులు, పురోహితుల కార్తీకమాస ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు హాజరుకానున్నారన్నారు. వీరితో పాటు దేవదాయ శాఖ అధికారులు హాజరు అవుతారన్నారు. ఈ సందర్భంగా అర్చకులు తమ సమస్యలను కార్యక్రమానికి హాజరు కానున్న దేవదాయశాఖ జిల్లా, రాష్ట్ర అధికారులకు అర్జీల రూపంలో ఇవ్వాలని తెలిపారు. మధ్యాహ్నం హాజరైన వారికి కార్తీక భోజనాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకు 99490 22141, 99630 62388 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు సీపీ బ్రౌన్ వర్ధంతి సభ

కడప కల్చరల్ : తెలుగు సూర్యుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వర్ధంతి సభను మంగళవారం ఉదయం 10.00 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సభకు మాజీ ఎమ్మెల్సీ, రచయిత షేక్ హుసేన్ సత్యాగ్ని అధ్యక్షత వహిస్తారని, వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బ్రౌన్ కేంద్రం ప్రచురించిన తాతాచార్య కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

శిల్పారామంలో ఆటా-పాట అదుర్స్



కడప కల్చరల్: ఆదివారం ఆటవిడుపులో భాగంగా కడప నగర పరిధిలోని శిల్పారామంలో ప్రదర్శించిన ఆటా–పాట అదుర్స్ అనిపించాయి. అందులో భాగంగా స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమి డాన్స్ మాస్టర్ విజయశాంతి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

చేనేత వస్త్రాలకు ఆదరణ

కడప కల్చరల్ : కడప టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న చేనేత, హస్తకళల ప్రదర్శనలో చేనేత వస్త్రాలకు ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు వెంకయ్య తెలిపారు. కళాజ్యోతి హ్యాండీక్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేది నుంచి జరుగుతున్న ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని ప్రముఖ బ్రాంచ్‌ల చేనేత వస్త్రాలకు నగర వాసుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 17 వరకు కొనసాగిస్తున్నామన్నారు.

మగ్గం మరమ్మతుల శిక్షణ ప్రారంభం

కడప కల్చరల్ : దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చేనేత కార్మికులకు మగ్గం మరమ్మతుల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని నాబార్డు ఏజీఎం విజయవిహారి ప్రారంభించారని సొసైటీ చైర్మన్ ఓబులదాస్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. నాబార్డు ఆర్థికసాయంతో నేత మగ్గాలను ఉపయోగిస్తున్న కార్మికులకు వాటికి అవసరమైనపుడు మరమ్మతులు చేసుకునేందుకు శిక్షణ ఇచ్చేందుకు ఖాజీపేట మండలం అప్పనపల్లె గ్రామంలో ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో 50 మంది నేత కార్మికులు పాల్గొన్నారని తెలిపారు.

తెలుగు సాహితీ విమర్శకు ఆద్యుడు 'కట్టమంచి'

కడప కల్చరల్ : కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్య విమర్శకు ఆద్యులని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి 144వ జయంతిని నిర్వహించారు. ప్రముఖ కవి గజ్జెల మల్లారెడ్డి కుమారుడు గజ్జెల అశోక్‌కుమార్‌రెడ్డి, బ్రౌన్ కేంద్రం సిబ్బంది, పాఠకులతో కలిసి కట్టమంచి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కట్టమంచిలో జన్మించడంతో ఆయనకు అదే ఇంటి పేరుగా మారిందని తెలిపారు. గజ్జెల అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కట్టమంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తొలి ఉపాధ్యక్షునిగా ఉన్నత విద్యలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , గ్రంథపాలకులు హరిభూషణరావు, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు కట్టమంచి బహుముఖ ప్రజ్ఞను గుర్తు చేశారు.